క్లుప్తంగా

స్పందన అర్జీల పరిష్కారానికి కృషి



రేపల్లె: ప్రజల సమస్యల పరిష్కారానికై ప్రవేశ పెట్టిన స్పందన కార్యక్రమానికి మూడు అర్జీలు అందినట్లు ఆర్డీఓ హేలా షారోన్ తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి మాట్లాడారు. రేపల్లె మున్సిపాలిటీలో డ్రైనేజ్ సమస్యపై 1, భూమిని ఆన్‌లైన్ చేయాలని కోరుతూ నగరం మండలం ధూళిపూడి, అల్లపర్రు గ్రామాల నుంచి ఇరువురు అర్జీలు అందించినట్లు చెప్పారు.

22న సుందరాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

పదమటిపాలెం(భట్టిప్రోలు): మండలం కోనేటి పురం పంచాయతీ పరిధిలోని పదమటిపాలెంలో కొలువైన సుందరాంజనేయ స్వామి ఆలయ 15వ వార్షికోత్సవం 22వ తేదీ నిర్వహించనున్నట్లు దేవాలయ మేనేజింగ్ ట్రస్టీ, విశ్రాంత ఐఏఎస్ అధికారి పదమటి సుందరకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు విశేష పూజలు, హనుమత్ కల్యాణం, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ పండుగ



భట్టిప్రోలు: భట్టిప్రోలులో ఆదివారం రాత్రి గ్యార్మీ పండుగను ఘనంగా నిర్వహించారు. ముస్లిం యువత ఆధ్వర్యంలో స్థానిక జెండా చెట్టు వద్ద నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం పురవీధులలో కొనసాగింది. ఈ పండుగలో కుల మత తారతమ్యం లేకుండా అందరూ భాగస్వాములయ్యారు. ప్రార్థనలు అనంతరం మొక్కులు తీర్చుకుని విద్యుత్ కాంతులతో అలంకరించిన జెండాను పురవీధులలో ఊరేగించారు. కార్యక్రమాన్ని ముస్లిం యువత అధ్యక్షులు షేక్ అదాం షఫీ, ఉపాధ్యక్షులు షేక్ గౌస్, నిర్వాహకులు షేక్ కరిముల్లా, పఠాన్ జాన్‌ఖాన్, షేక్ సల్మాన్, షేక్ ఖాజా, పఠాన్ షేర్‌ఖాన్ పాల్గొన్నారు.

వేమూరు నుంచి బాపట్ల బస్సు సర్వీసు

వేమూరు: వేమూరు నుంచి బాపట్లకు బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు బాపట్ల డిపో మేనేజరు టి.శ్రీనివాసరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాపట్లలో ఉదయం 6.30 గంటలకు బయలుదేరి 8.30 గంటలకు వేమూరు చేరుకుంటుందని చెప్పారు. వేమూరులో 9 గంటలకు బయలు దేరి బాపట్ల 11 గంటలకు వెళ్తుందని వివరించారు. మధ్యాహ్నం 3.30 గంటలకు బాపట్ల బయలు దేరి, 5.30కు వేమూరు చేరుకుంటుందని, వేమూరులో 6 గంటలకు బయలు దేరి రాత్రి 8 గంటలకు బాపట్ల చేరుతుందని వివరించారు. ఈ బస్సు వేమూరు, కొల్లూరు, వెల్లటూరు, భట్టిప్రోలు, చెరుకుపల్లి మీదగా నడపనున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల స్థానికులు మంత్రి మేరుగ నాగార్జునకు విన్నవించారు. స్పందించిన ఆయన ఆర్టీసీ రీజియన్ మేనేజర్‌తో మాట్లాడి బస్సు సర్వీసు నడపాలని ఆదేశించడంతో పాటు ఇటీవల కలెక్టర్ రంజిత్‌బాషా వేమూరులో నిర్వహించిన స్పందనలో అర్జీ రావడంతో అధికారులు చర్యలు చేపట్టారు. బాపట్ల నుంచి వేమూరుకు బస్సు సౌకర్యం కల్పించారు.

ప్రజారక్షణ భేరీ వాల్‌పోస్టర్‌లు విడుదల

రేపల్లె రూరల్: ప్రజల సమస్యలపై గళంవిప్పేందుకే ప్రజారక్షణభేరీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. విజయవాడలో ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న ప్రజారక్షణ భేరీ వాల్‌పోస్టర్‌లను పట్టణంలోని కార్యాలయంలో సోమవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజారక్షణ భేరీ ప్రచారయాత్రలో భాగంగా కర్నూలు జిల్లా నుంచి వస్తున్న బస్సు యాత్ర 8వ తేదీ రేపల్లెకు చేరుతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కే రమేష్, ఆశీర్వాదం, కేవీ లక్ష్మణరావు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజం కోసం కృషి చేద్దాం

బాపట్ల: అవినీతి రహిత సమాజం కోసం కృషి చేద్దామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ విమల బీరా పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేపట్టారు. అవినీతిపై విద్యార్థులకు పోరాటం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఏడుకొండలు, డాక్టర్ శ్రీనివాసరావు, సౌజన్య, డాక్టర్ గౌతమి, రామిరెడ్డి పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షం..

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- భట్టిప్రోలులో 26.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు



భట్టిప్రోలు మండలం వెల్లటూరు హైస్కూల్ వద్ద నిలిచిన వర్షం నీరు

భట్టిప్రోలు: ఉపరితల ఆవర్తన ప్రభావంతో సోమవారం తెల్లవారుజాము నంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాల్వలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చాకలి చెరువు, పెద చెరువులలోని నీరు ఎగదన్నడంతో భట్టిప్రోలులోని కొత్త విశలేశ్వరనగర్ కాలని, దేవాలయం వద్ద వర్షం నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. కాలనీలో రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో నీరునిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. భట్టిప్రోలులోని ఇళ్ల స్థలాల ప్లాట్లలో వర్షపు నీరు చేరింది. ఐలవరంలో కూడా వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. 26.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు.

వలివేరులో...

చుండూరు మండలం వలివేరులో సోమవారం కురిసిన వర్షం దాటికి వరి పైరు చాపలా నేలవాలింది. గత కొద్ది రోజులుగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు ఆకాశం వైపు దిక్కులు చూశారు. ఇంతలో ఒక్కసారిగా వర్షం ఎడతెరిపి లేకుండా కురియడంతో ముదురు వరి పైరు నేలవాలింది. ఇప్పటికే అధిక వ్యయం వెచ్చించి పంట సాగు చేయగా ఈ వర్షాలు కోలుకోలేని దెబ్బ తీశాయని రైతులు వాపోతున్నారు.

నేలవాలిన వరిపైరు..

కొల్లూరు: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో కొల్లూరు మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ముదురు వరిపైర్లు నేలకొరిగాయి. ఇప్పటి వరకు వర్షాలు పడక రైతాంగం అల్లాడుతుంటే ఒక్కసారిగా కురిసిన ఈ వర్షం రైతులను కుంగదీసింది. ఇప్పటి వరకు భారానికి మించి పెట్టుబడి పెట్టగా నేలకొరిగిన పంటను నిలబెట్టాలంటే అదనపు కూలీ అవుతుందని రైతులు వాపోయారు. అలాగే మెట్ట సాగులో భాగంగా వేసిన మినుము పైరు కూడా ఈ వర్షం ఆశనిపాతంలా తయారయ్యింది. ఈ వర్షాల వల మినుముల్లో పూత రాలిపోయే ప్రమాదం ఉందని రైతులు తెలిపారు. మండలంలో మాగాణిలో సాగు చేసిన వరి పైరు 200 ఎకరాలు దెబ్బతినగా, మెట్టలో మినుము 150 ఎకరాలు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు.



భట్టిప్రోలు జెండా చెట్టు బజారులో నిలిచిన వర్షం నీరు

పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం



బహుమతులు అందుకున్న విద్యార్థులు

తెనాలి: వేజళ్ల వెంకట సుబ్బారావు జయంతి సందర్భంగా ఆయన పేరిట ఉన్న స్మారక విద్యాట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అయితానగర్‌లోని ఎన్ఎస్ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, క్రీడాపోటీలను జరిపారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ మాట్లాడుతూ తన తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెళుతూ ఆయన పేరిట ఏటా విద్య, వైద్య సేవలు, వృద్ధులకు ఆర్థిక చేయూతను అందజేస్తున్నట్లు చెప్పారు. విద్యాకమిటీ చైర్మన్ ఎం.రాజు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించే సదుపాయాలతోపాటు సేవాసంస్థలు ఇచ్చే సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు రాజకిశోర్ అధ్యక్షత వహించారు. మొక్కలను పెంచుదాం... పర్యావరణాన్ని కాపాడుతాం...అంటూ ఎన్‌సీసీ అధికారి బి.వెంకట్ పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. ట్రస్ట్ సభ్యురాలు నవ్య, పాఠశాలకు మొక్కలు బహూకరించారు. ట్రస్ట్ సభ్యులు ఓంకార్ ప్రసాద్, బి.శివరామకృష్ణ, బి.శివసాయిప్రసాద్ పాల్గొన్నారు.

బలమైన సంకల్పం.. ఆలోచన దివ్యం

- తీవ్ర మధుమేహంతో కాలు కోల్పోయిన పొన్నూరు మండలం ఆలూరు గ్రామానికి చెందిన షేక్ బాబావలి
- గుండె సంబంధిత సమస్యతోనూ బాధపడుతున్న వైనం
- గుర్తించి చలించిన బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- జైపూర్ పాదాలు చేయించి, స్వయంగా తొడిగి నడిపించిన వైనం



జైపూర్ పాదం తొడిగి బాబావలిని నడిపిస్తున్న అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు(గుంటూరు): పొన్నూరు మండలం, ఆలూరు గ్రామానికి చెందిన షేక్ బాబావలి అదుపు తప్పిన మధుమేహంతో తీవ్ర అనారోగ్యం పాలై చివరకు తన కుడి కాలును నడుము కింది వరకు కోల్పోయి దివ్యాంగుడిగా మారాడు. తీవ్ర నైరాశ్యంతో బతుకుబండిని ఈడుస్తున్నాడు. బజరంగ్ ఫౌండేషన్ నేతృత్వంలో ఇటీవల కట్టెంపూడి గ్రామంలో చేపట్టిన మీ గుండె పదిలం కార్యక్రమానికి హాజరైన బాబావలి పరిస్థితిని చూసి ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ చలించిపోయారు. ఈ వైకల్యం చాలదన్నట్లు మరోవైపు బాబావలి గుండెలో బ్లాక్ ఏర్పడి స్టంట్ వేయాల్సిన పరిస్థితి ఉన్నట్లు వైద్య శిబిరంలో నిర్ధారణ అయింది. ఇదంతా చూసిన అంబటి మురళీకృష్ణ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. బాబావలిని ఈ అనారోగ్య సుడిగుండం నుంచి బయటపడేయాలని బలమైన సంకల్పం తీసుకున్న మురళీకృష్ణ బజరంగ్ ఫౌండేషన్ 'మీ గుండె పదిలం' ద్వారా అతనికి అందాల్సిన గుండె వైద్యాన్ని ఓ వైపు కొనసాగిస్తూనే, మరోవైపు జైపూర్ పాదాల తయారీకి సిద్ధమయ్యారు. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ప్రత్యేకమైన కొలతలతో బాబావలి కోసం రూపొందించిన జైపూర్ పాదాలతో సోమవారం ఆలూరు గ్రామంలోని బాబావలి నివాసానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మురళీకృష్ణ జైపూర్ పాదాలను బాబావలికి అందజేసి, తొడిగిన పాదంతో నడిపించి ప్రోత్సహించారు. బజరంగ్ ఫౌండేషన్ తరపున అతని ఇంటిలో ఒక వెస్టన్ కమోడ్‌ను నిర్మించి ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా నడక తర్ఫీదు అయిన వెంటనే విజయవాడకు తీసుకువెళ్లి స్టంట్ వేయాలని నిర్ణయించారు.

యడ్లపాడులో తెనాలి ఫొటోగ్రాఫర్ దుర్మరణం



మృతి చెందిన ప్రభుకుమార్

యడ్లపాడు: బైక్‌పై ప్రయాణిస్తూ సినీఫక్కీలో 20 అడుగుల ఎత్తులో ఉన్న వంతెనపై నుంచి కిందపడి తెనాలికి చెందిన ఫొటోగ్రాఫర్ మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. వివరాలలోకి వెళితే.. తెనాలి పట్టణం రామలింగేశ్వరనగర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ కొడవటి ప్రభుకుమార్ (31) బైక్‌పై సోమవారం సాయంత్రం చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో యడ్లపాడు వద్ద ప్రారంభంలో ఉన్న అండర్‌పాస్ వంతెనపై ఎక్కి మలుపు తిప్పే క్రమంలో వాహనం అదుపుతప్పి ఎడమవైపు ఉన్న సైడ్‌వాల్‌కు ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ప్రభుకుమార్ ఒక్కసారిగా గాల్లోకి ఎగిరి వంతెన కింద ఉన్న సర్వీసు మార్గంలోని స్పీడ్‌బ్రేకర్లపై వచ్చి పడ్డాడు. 108 వాహన సిబ్బంది చేరుకుని యువకుడిని పరీక్షించి తలకు బలంగా తగలడంతో అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఊహించని ఈ సంఘటనకు ఈ బ్రేకర్లకు సమీపంలోని బైక్ మెకానిక్, ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలతో పాటు సమీపంగా ఉన్న జనం చూసి షాకయ్యారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న యడ్లపాడు ఎస్ఐ పి సురేష్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పైనుంచి ఎలా పడి ఉంటాడని పైకి వెళ్లి చూడగా యువకుడి బైక్ వంతెనపై మలుపు వద్ద పడి ఉండటాన్ని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించాలి

ద్వామా పీడీ యుగంధర్‌కుమార్

తెనాలిటౌన్: ఉపాధి హామీ పథకం ద్వారా పని చేసే కూలీలలకు వంద రోజులు పనిదినాలు కల్పించాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ యుగంధర్‌కుమార్ ఆదేశించారు. కొత్తపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం 16వ విడత ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. రాష్ట్ర రిసోర్స్ పర్సన్ నందిని ఆధ్వర్యంలోజరిగిన సభలో ఆయన మాట్లాడారు. మండలంలోని 18 గ్రామాల్లో ఉపాధి ద్వారా చేపట్టిన పనులు, పంచాయతీ రాజ్ పనుల వివరాలను డీఆర్‌పీ మల్లికార్జున్ సభ దృష్టికి తీసుకొచ్చారు. రికార్డులను అధికారులు తనిఖీ చేశారు. సభలో అంబుడ్స్ విజిలెన్స్ ఆఫీసర్ క్రిస్టినా, ఏపీడీ కె.ఆనందమోహన్, ఇన్‌చార్జి ఎంపీడీఓ వి.ప్రతాపరెడ్డి, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ జి.సుభాష్‌చంద్రబోస్, డీఆర్‌పీలు మల్లికార్జున్, భరత్‌కుమార్, నాగరాజు, హరిబాబు, కల్యాణ్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

మత్స్యకారులు లైఫ్‌జాకెట్లు వెంట తీసుకెళ్లాలి



నిజాంపట్నం: వేటకు వెళ్లే మత్స్యకారులు తప్పనిసరిగా బోట్లలో లైఫ్ జాకెట్‌లను వెంట తీసుకెళ్లాలని ఫిషరీస్ అసిస్టెంట్ ఎర్రసాని శంకర్ తెలిపారు. మండలంలోని గోకర్ణమఠం ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌లో మెరైన్ మత్స్య సాగుబడి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళేటప్పుడు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని తప్పనిసరిగా బోటులో లైఫ్ జాకెట్‌లతో పాటు ప్రమాదాల నుంచి తప్పించుకునే పరికరాలను తప్పనిసరిగా తీసుకెళ్లాలని సూచించారు. అదే విధంగా బోట్లకు పసుపు రంగు, బ్లూ రంగు వేసుకుని బోటుకు ఇరువైపులా బోటు రిజిస్ట్రేషన్ నెంబర్ వేయాలన్నారు. సముద్రంలో అపరిచిత బోట్లు, వస్తువులు కనిపించినప్పుడు, ప్రమాదాలు జరిగినప్పుడు కోస్టుగార్డు నెంబర్ 1554, మెరైన్ పోలీసుల నెంబర్ 1093, కాల్‌చేసి తెలియపరచాలని సూచించారు.

పేదలకు అన్నదానం

భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్ 1984–1985 బ్యాచ్ పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ప్రతి నెల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జంగం రవి ఆధ్వర్యంలో ప్రతి నెల 6వ తేదీన స్థానిక రైలు పేటలో 250 మందికి అన్నదానం చేస్తున్నారు.

ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



పాత గుంటూరు: మంగళదాస్‌నగర్ మెయిన్‌రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గుంటూరు నగర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు షేక్ మహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్‌రావు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యవర్గ అధ్యక్షుడిగా గోపవరపు శివ సత్యనారాయణ గుప్త, ఉపాధ్యక్షులుగా మాజేటి రామారావు, చింతా నాగేశ్వరరావు, వనమా నరేంద్ర, కార్యదర్శి పోలిశెట్టి రామకిషోర్, కోశాధికారిగా కట్టమూరి రవి, సహాయ కార్యదర్శులు మద్దు సాంబశివరావు, మిరియాల వెంకటేష్, సంపత్ కుమార్, సభ్యులచే ఎమ్మెల్యే ముస్తఫా ప్రమాణం చేయించారు. అతిథులు మాట్లాడుతూ కార్యవర్గ సభ్యులు సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో నగర యువత అధ్యక్షుడు గార్లపాటి రవి కిరణ్, గుంటూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

బాలికలకు సైకిళ్ల అందజేత



తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో సోమవారం దివంగత ధూళిపాళ్ల రామకోటేశ్వరరావు జ్ఞాపకార్థం డాక్టర్ ధూళిపాళ్ల రవీంద్రనాథ్ ఇద్దరు బాలికలకు సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు మాట్లాడుతూ క్లబ్ తరపున ఇప్పటి వరకు 115 మందికి సైకిళ్లను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. తద్వారా బాలికలు పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు లేకుండా సహకరించినట్లు చెప్పారు. నల్లజర్ల లోకేశ్వరరావు ఆధ్వర్యంలో మరో బాలికకు సైకిల్‌ను అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, కోశాధికారి కేఎల్ జగదీశ్వరాంబ, గుత్తా వెంకటరత్నం, జీవీ నారాయణ, చేతన్‌రాజ్ కొఠారి, నరేష్, కె.ప్రవీణ్, జాన్ కీట్స్, కిరణ్, గణేష్ యూత్, రొటేరియన్స్ మురళీకృష్ణ, సుభాని, అర్జున పాల్గొన్నారు.

9 నుంచి 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి'

పిట్టలవానిపాలెం: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని నీటిపారుదల శాఖ అతిథి గృహంలో సోమవారం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 9వ తేదీ నుంచి 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమాన్ని అన్ని గ్రామ సచివాలయాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

9, 19 తేదీల్లో పిట్టలవానిపాలెం, 14వ తేదీన పోతనకట్టవారిపాలెం, 15వ తేదీన సంగుపాలెం, 16వ తేదీన ఖాజీపాలెం, 17వ తేదీన మంతెనవారిపాలెం, 20వ తేదీన చందోలు-1, 21వ తేదీన చందోలు-2, 22వ తేదీన అల్లూరు, 23వ తేదీన భవనంవారిపాలెం గ్రామ సచివాలయాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ బాజీ, వైస్ ఎంపీపీ సీతారామరాజు, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, పార్టీ నాయకులు కూసంపూడి దేవేంద్రరాజు, ఎనుముల కోటేశ్వరరావు, వాలి శివారెడ్డి, పమిడి గోపి, అల్లూరి సురేష్, బొలగాని సుబ్బారావు, కుంఠం ప్రసన్నరాజు, కొర్లపాటి రాజేష్, డేగల శ్రీనివాస రెడ్డి, అశోక్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డీఎల్‌డీఓగా ఉద్యోగోన్నతి పొందిన శ్రీనివాసరావుకు సన్మానం



శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ రత్నప్రసాద్ అధికారులు ప్రజా ప్రతినిధులు

చెరుకుపల్లి: మండలంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు అందించిన సేవలు అభినందనీయమని ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్ అన్నారు. మండలంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు డీఎల్‌డీఓగా పదోన్నతి పొంది తాడేపల్లి పంచాయతీ రాజ్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సోమవారం శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ సమన్వయంతో అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. అనంతరం శ్రీనివాసరావు రాజేశ్వరి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలోడీఎల్‌పీఓ తాతా శివశంకర రావు, తహసీల్దార్ కె.వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగలక్ష్మి, సబ్‌రిజిస్ట్రార్ భీమాబాయ్, ఎంఈఓలు నవీన్ కుమార్, పులి లాజర్, ఏపీఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి



జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును పరిశీలించి పరీక్ష చేయించుకుంటున్న కమిషనర్ భానుప్రతాప్

బాపట్ల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఏ భానుప్రతాప్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశాలు మేరకు బాపట్లలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ క్యాంపులో డాక్టరు వరికూటి అమృతపాణి వంటి ప్రముఖ వైద్యులు ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేయించారు. రోగులకు ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఆర్డీఓ గంధం రవీంద్రబాబు పరిశీలించారు.

పర్యావరణహిత దీపావళిపై అవగాహన ర్యాలీ



మున్సిపల్ ప్రజారోగ్య సిబ్బంది ర్యాలీ

తెనాలి: స్వచ్ఛ దీపావళి- శుభ దీపావళి...అనే నినాదంతో పర్యావరణహితంగా దీపావళి పర్వదినాన్ని జరుపుకోవాలని కోరుతూ మున్సిపల్ ప్రజారోగ్య సిబ్బంది సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వాయుకాలుష్యాన్ని నివారించి, శ్వాసకోశ వ్యాధులు రాకుండా చూసుకోవాలని కోరారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పరిసరాల్లోని పర్యావరణాన్ని రక్షించుకోవాలని కోరుతూ ర్యాలీలో నినాదాలు చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, గుమ్మడి ప్రసాద్, వై.అనుపమ, ఎం.సుబ్బారావు, ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ జి.శ్రీనివాసరావు, పి.సుధాకర్, శానిటేషన్ కార్యదర్శులు కె.నాగరాజు, ఎ.ఉమామహేశ్వరరావు, టి.శ్రీనివాస్, ఎన్.నరేష్‌బాబు, డీఎస్ఓ షరీఫ్ పాల్గొన్నారు.

బాణసంచా వ్యాపారులు అన్ని అనుమతులు కలిగి ఉండాలి



దుకాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రవిబాబు

తెనాలిరూరల్: బాణసంచా వ్యాపారులు అన్ని అనుమతులు కలిగి ఉండాలని తహసీల్దార్ కె.రవిబాబు స్పష్టం చేశారు. మండలంలోని కొలకలూరు గ్రామంలోని బాణసంచా హోల్‌సేల్ దుకాణాన్ని సోమవారం తనిఖీ చేశారు. వ్యాపారులు జీఎస్టీ చెలిస్తున్నారా, అగ్నిప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉన్నాయా, నిబంధనలు పాటిస్తున్నారా? అన్న అంశాలను పరిశీలించారు. బాణసంచా వ్యాపారులు సంబంధిత అన్ని శాఖల నుంచి అనుమతులు తీసుకోవాల్సిందేనన్నారు. నిబంధనలు పాటించకపోతే బాణసంచా గోడౌన్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలానే డీఎస్పీ బి.జనార్ధనరావు, పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన వెంకట రూరల్ సీఐ కె.శ్రీనివాస రెడ్డి, ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు ఉన్నారు.

కార్పొరేషన్ అభివృద్ధికి రోడ్ల విస్తరణ తప్పనిసరి

- ప్రజలు సహకరించాలి
- కమిషనర్ యు.శారదాదేవి



మాట్లాడుతున్న కమిషనర్ శారదాదేవి

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ మరింత శరవేగంగా అభివృద్ధి చెందాలంటే రహదారుల విస్తరణ తప్పనిసరి అని కార్పొరేషన్ కమిషనర్ యు శారదాదేవి అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం తెనాలి రోడ్డు విస్తరణలో భాగంగా మిద్దె సెంటర్ నుంచి వడ్లపూడి సెంటర్ వరకు ఉన్న దుకాణదారులు, నిర్వాసితులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించారు. పలువురు దుకాణదారులు, నిర్వాసితుల అభిప్రాయాలను సేకరించారు. కమిషనర్ మాట్లాడుతూ ఎవరికీ ఇబ్బంది లేకుండా రోడ్డు విస్తరణ చేపట్టడం జరుగుతుందన్నారు. చేనేత వస్త్ర దుకాణదారులందరికి నగర నడిబొడ్డున చేనేత భవనం నిర్మాణం పూర్తి చేసి దుకాణాలను కేటాయించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎవరికి ఎలాంటి నష్టం లేకుండా ప్రభుత్వ స్థలంలోని ఆక్రమణల తొలగింపుతోపాటు రోడ్డుకు అవసరమైన మేరకు స్థలం సేకరించి వారికి నిబంధనలకు అనుగుణంగా తగు న్యాయం చేయడం జరుగుతుందన్నారు. 2006 మాస్టర్ ప్లాన్ ప్రకారమే రోడ్డు విస్తరణ చేపడుతున్నామని రోడ్డు విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాలి

తెనాలి: పట్టణంలోని వ్యాపారులు లైసెన్సులను వెంటనే రెన్యువల్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు కోరారు. ఏటా ఫిబ్రవరి నెలలోనే రెన్యువల్ చేసుకోవాల్సి ఉండగా, ఇప్పటికీ కొందరు రెన్యువల్ లేకుండా వ్యాపారాలను కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. రెన్యువల్ చేసుకోకుంటే వ్యాపార సంస్థలకు నోటీసులు ఇచ్చి ప్రాసిక్యూషన్ చేస్తామని హెచ్చరించారు. కమిషనర్ ఆదేశానుసారం మున్సిపల్ సిబ్బంది సోమవారం పట్టణంలోని పలు వ్యాపార దుకాణాలను తనిఖీలు చేసి, లైసెన్సు లేని సంస్థలకు నోటీసులను ఇచ్చారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, ప్రసాద్ పాల్గొన్నారు.